
ప్రజా విశ్వంభర



# నేను ఎప్పుడూ నా లుక్స్ కంటే పాత్రను పండించడం పైనే ఎక్కువ శ్రద్ధ పెడతాను

బాలీవుడ్ యంగ్ హీరోయిన్ శార్వరి వాఘ్ భారీ యాక్షన్ చిత్రం 'ఆల్ఫా'లో స్టార్ హీరోయిన్ ఆలియా భట్ తో కలిసి స్క్రీన్ షేర్ చేసుకోబోతోంది. తాజాగా, ఓ ఇంటర్వ్యూలో పాల్గొన్న ఆమె ఆలియా భట్‌తో తనకున్న బాండింగ్ గురించి ఆసక్తికరమైన విషయాలను పంచుకుంది. "ఇండస్ట్రీలో ఇద్దరు హీరోయిన్లు స్నేహితులుగా ఉండలేరనేది ఒక పెద్ద అబద్ధం. ఆమె నాపై చూపించిన ప్రేమ, సపోర్ట్ నిజంగా ఎంతో గొప్పవి. మా సినిమా టీమ్ అందరికీ ఆమె ఒక పెద్ద చీర్‌లీడర్ లాంటిది. కెరీర్ ప్రారంభంలోనే నేను, వేదాంగ్‌తో కలిసి ఇంతియాజ్ సర్ డైరెక్షన్‌లో సినిమా చేస్తున్నామని తెలియగానే ఆలియా మాకు మెసేజ్ చేసింది. 'మీ కెరీర్ స్టార్టింగ్‌లో మిమ్మల్ని మీరు ఎక్స్‌ప్లోర్ చేసుకోవడానికి ఇంతియాజ్ సర్ కంటే బెస్ట్ డైరెక్టర్ దొరకరు, ఆయన మీకు ఎంతో హెల్ప్ చేస్తారు' అని చెప్పింది. ఆలియా చెప్పిన మాటల అర్థం అప్పుడు నాకు తెలియలేదు కానీ, ఇప్పుడు ప్రాక్టికల్‌గా అర్థమవుతోంది" అని శార్వరి ఎమోషనల్ అయింది. ఆలియా భట్ అంటే తనకు, వేదాంగ్‌కు ఎంతో ఇష్టమని.. ఆమె అద్భుతమైన నటి మాత్రమే కాదు, అంతకంటే మంచి మనసున్న వ్యక్తి అని శార్వరి కొనియాడింది. 'ఆల్ఫా' లాంటి ప్రతిష్టాత్మక చిత్రంలో ఆమె పక్కన నిలబడి యాక్టింగ్ నేర్చుకోవడం తనకు దక్కిన ఒక అమూల్యమైన అనుభవమని శార్వరి సంతోషం వ్యక్తం చేసింది. అంతేకాకుండా సినీ పరిశ్రమలో ప్రతిభ కంటే అందానికే ఎక్కువ ప్రాధాన్యత ఇస్తారా? అనే ప్రశ్నకు ఎంతో మెచ్యూర్డ్‌గా సమాధానమిచ్చింది. "ప్రస్తుత కాలంలో నటీనటులకు లుక్స్ కంటే వారి నటన, ప్రతిభే అత్యంత ముఖ్యం. ఇప్పుడున్న ప్రోస్తెటిక్స్ టెక్నాలజీతో ప్రతి సినిమాలోనూ సరికొత్తగా కనిపించవచ్చు. ప్రేక్షకులు కూడా మన స్క్రీన్ ప్రెజెన్స్ కంటే మనం చేసే క్యారెక్టర్‌ను, మన నటనను చూసే ఆదరిస్తున్నారు. అందుకే నేను ఎప్పుడూ నా లుక్స్ కంటే పాత్రను పండించడం పైనే ఎక్కువ శ్రద్ధ పెడతాను" అని శార్వరి స్పష్టం చేసింది.

## ఇది కేవలం సినిమా పబ్లిసిటీ కోసం చేసే పని కాదు

టాలీవుడ్ యంగ్ హీరోయిన్ శ్రీలీల ఇండస్ట్రీకి వచ్చిన అనతి కాలంలోనే విపరీతమైన క్రేజ్‌ను రాబట్టుకుని మోస్ట్ వాంటెడ్ బ్యూటీగా మారిపోయింది. ముఖ్యంగా తన ఎనర్జిటిక్ పర్ఫార్మెన్స్, అద్భుతమైన డాన్స్, చలాకీతనంతో యువతలో ఆమెకు విపరీతమైన క్రేజ్ ఏర్పడింది. ఇక ఆమె చేసిన చిత్రాలు గత కొద్ది కాలంగా హిట్ అందుకోలేకపోతున్నప్పటికీ అమ్మడుకి వరుస అవకాశాలు వస్తున్నాయి. ప్రస్తుతం శ్రీలీల కోలీవుడ్ స్టార్ హీరో ధనుష్ 'D-55' ప్రాజెక్ట్‌లో హీరోయిన్‌గా నటించనుంది. అలాగే బాలీవుడ్‌లో కార్తీక్ ఆర్యన్ సరసన మ్యూజికల్ రొమాంటిక్ డ్రామా 'ఆషికీ-3'లో చేస్తోంది. తన యాక్టింగ్, డాన్స్‌లతోనే కాకుండా తన ఆలోచనలతోనూ ప్రేక్షకులను ఎంతగానో ఆకట్టుకుంటున్న శ్రీలీల.. భాష, సంస్కృతి వివిధ ప్రాంతాల ప్రేక్షకుల పట్ల తనకు ఉన్న గౌరవాన్ని చాటుకుంటూ ఆమె చేసిన వ్యాఖ్యలు ఇప్పుడు సోషల్ మీడియాలో వైరల్ అవుతున్నాయి. ప్రస్తుతం ఇండియన్ సినిమాలో భాషా భేదాలు లేకుండా నటీనటులు అన్ని పరిశ్రమల్లోనూ నటిస్తున్నారు. ఇలాంటి సమయంలో, వేరే ఇండస్ట్రీకి వెళ్ళినప్పుడు అక్కడి స్థానిక భాష మాట్లాడటం ఎంత ముఖ్యమో శ్రీలీల చాలా చక్కగా వివరించింది. వివిధ ప్రాంతాల ప్రేక్షకులతో కనెక్ట్ అవ్వడం గురించి శ్రీలీల మాట్లాడుతూ.. "నా విషయానికి వస్తే, నేను ప్రతి భాషను ఎంతో గౌరవిస్తాను. నేను స్వయంగా నాలుగు, ఐదు భాషల్లో పని చేస్తున్నాను. నేను ఏదైనా కొత్త ప్రాంతానికి వెళ్ళినప్పుడు, అక్కడ స్టేజ్ మీద ఉన్నంతసేపూ స్థానిక భాషలోనే మాట్లాడటానికి ప్రయత్నిస్తాను. ఆ ప్రాంతానికి, అక్కడి భాషకు ప్రజలకు నేను ఇచ్చే కనీస గౌరవం అది" అని చెప్పుకొచ్చింది. పబ్లిక్ ఈవెంట్స్‌లో స్థానిక భాషలో మాట్లాడటం వల్ల ప్రేక్షకులకు, స్టార్స్‌కు మధ్య ఉన్న దూరం తగ్గి, ఒక మంచి అనుబంధం ఏర్పడుతుందని శ్రీలీల అభిప్రాయపడింది. ఇది కేవలం సినిమా పబ్లిసిటీ కోసం చేసే పని కాదని, మనల్ని సెలబ్రిటీలుగా గుర్తించిన ఆయా ప్రాంతాల ఐడెంటిటీని గౌరవించడమేనని ఆమె స్పష్టం చేసింది. శ్రీలీల తీసుకున్న ఈ నిర్ణయం.. భాష పట్ల ఆమెకున్న గౌరవం చూసి నెటిజన్లు, సినీ ప్రియులు ఆమెపై ప్రశంసల జల్లు కురిపిస్తున్నారు.



### రెంటల్ విధానంలోనే 'పెద్ది'..

## చిరంజీవి జోక్యంతో సద్దుమణిగిన వివాదం

అగ్ర నటుడు చిరంజీవి తో తెలంగాణ ఎగ్జిబిటర్ల సమావేశం ముగిసింది. ఈ భేటీలో సినీ పరిశ్రమలో పర్సంటేజీల వివాదం సద్దుమణిగింది. చిరంజీవి జోక్యంతో పర్సంటేజీ నిర్ణయం వాయిదా పడింది. జూన్ 4న విడుదల కానున్న 'పెద్ది' సినిమాను రెంటల్ విధానంలోనే ప్రదర్శించాలని ఎగ్జిబిటర్లు నిర్ణయించారు. జూన్ 30 తర్వాత విడుదలయ్యే చిత్రాలకు పర్సంటేజీ విధానం వర్తింపజేస్తామన్నారు. ఈ మేరకు తెలంగాణ ఎగ్జిబిటర్లు తీసుకున్న నిర్ణయంపై చిరంజీవి హర్షం వ్యక్తం చేశారు. ఫిల్మ్ ఛాంబర్ కమిటీ నివేదిక మేరకు నడుచుకోవాలని సూచించారు.

**ఆ రోజు నుంచి పర్సంటేజీ విధానంలోనే..**

చిరంజీవితో భేటీ ముగిసిన అనంతరం.. ఎగ్జిబిటర్ల తరఫున తెలంగాణ స్టేట్ ఫిల్మ్ ఛాంబర్ ఆఫ్ కామర్స్ ప్రెస్‌నోట్ విడుదల చేసింది. జూన్ 30లోగా పర్సంటేజీ సమస్యను పరిష్కరిస్తానని చిరంజీవి హామీ ఇచ్చారని చెప్పింది. జులై 3 నుంచి కొత్త పర్సంటేజీ విధానం అమలు కానుందని తెలిపింది. ఆ రోజు నుంచి రెంటల్ సిస్టమ్ ఉండదని, పర్సంటేజీ విధానంలోనే సినిమాల ప్రదర్శన ఉంటుందని స్పష్టం చేసింది.సింగిల్ స్క్రీన్లలోనూ పర్సంటేజీ విధానంలోనే సినిమాలను ప్రదర్శిస్తామని తెలంగాణ ఎగ్జిబిటర్ల అసోసియేషన్ డిమాండ్ చేసిన సంగతి తెలిసిందే. దీనిపై కొన్ని రోజులుగా చర్చలు జరిగాయి. సమస్య పరిష్కారం కోసం చలన చిత్ర వాణిజ్య మండలి.. నిర్మాతలు, పంపిణీదారులు, ప్రదర్శనకారులతో ఓ ప్రత్యేక కమిటీని కూడా ఏర్పాటు చేసింది. అయితే, 'పెద్ది' చిత్రాన్ని అద్దె విధానంలో ప్రదర్శించలేమని ఓ సమావేశంలో పలువురు ఎగ్జిబిటర్లు అభిప్రాయం వ్యక్తంగా చేయగా.. కొందరు నిర్మాతలు వ్యతిరేకించారు. దీంతో, ఈ వ్యవహారంపై చిరంజీవి జోక్యం చేసుకున్నారు. ఈనెల 25న ఆయనతో భేటీ అయిన ఎగ్జిబిటర్లు.. నేడు (బుధవారం) మరోసారి సమావేశమై, తుది నిర్ణయాన్ని చెప్పారు. రామ్‌చరణ్ హీరోగా తెరకెక్కిన చిత్రమే 'పెద్ది'.



### 'ధురంధర్' ప్రొడక్షన్ డిజైనర్‌పై లైంగిక వేధింపుల కేసు



ఇండస్ట్రీలో సంచలనం సృష్టించిన చిత్రం 'ధురంధర్'. తాజాగా ఈ చిత్రానికి వర్క్ చేసిన ప్రొడక్షన్ డిజైనర్ సైనీ జోహ్రేపై లైంగిక వేధింపుల ఆరోపణలతో పోలీసులు కేసు నమోదు చేయడం చర్చనీయాంశంగా మారింది. ఈ ప్రాజెక్టులో అసిస్టెంట్ ఆర్ట్ డైరెక్టర్‌గా పనిచేసిన ఓ యువతి ఇచ్చిన ఫిర్యాదు మేరకు చండీగఢ్ పోలీసులు ఎఫ్ఐఆర్ నమోదు చేశారు. గతేడాది సెప్టెంబర్ 10న సినిమాకు సంబంధించిన చర్చల కోసం సైనీ తనను చండీగఢ్‌లోని ఒక హోటల్‌కు రావాలని కోరినట్లు బాధితురాలు తన ఫిర్యాదులో పేర్కొన్నారు. అక్కడికి వెళ్లాక అసభ్యకరంగా ప్రవర్తించారని ఆమె ఆరోపించారు. తాను అనారోగ్యానికి గురైనప్పటికీ, అక్కడి నుండి వెళ్లనివ్వకుండా అడ్డుకున్నారని తెలిపారు. అంతేకాకుండా ఈ విషయాన్ని ఎవరికైనా చెబితే కెరీర్ దెబ్బతింటుందని నిందితుడు బెదిరించినట్లు ఆమె ఫిర్యాదులో వివరించారు. ఈ ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.



## ఆ మాట చెప్పడానికి నేను భయపడను: దిల్ రాజు

ప్రస్తుతం ఇండస్ట్రీ చాలా క్లిష్టపరిస్థితుల్లో ఉందని నిర్మాత దిల్ రాజు తెలిపారు. తాను ఈ మాట చెప్పడానికి భయపడనన్నారు. 'సమ్మర్ హాలీడేస్' సినిమా టీజర్ లాంచ్ ఈవెంట్‌కు దిల్ రాజు ముఖ్య అతిథిగా హాజరయ్యారు. కొత్త వాళ్లతో సినిమా చేస్తే విజయం వస్తుందని తాను నమ్ముతానంటూ.. సమ్మర్ హాలీడేస్ మంచి హిట్ కావాలని ఆకాంక్షించారు. ఈ సందర్భంగా ఇండస్ట్రీని ఉద్దేశించి ఆయన మాట్లాడారు. ''ఇండస్ట్రీ ప్రస్తుతం చాలా కష్టకాలంలో ఉందని చెప్పడానికి చాలా మంది భయపడతారు. నేను ఈ విషయాన్ని ధైర్యంగా చెప్పగలను. ప్రేక్షకులను థియేటర్‌లకు తీసుకురావడమే మనందరికీ ఇప్పుడు సవాల్. సమ్మర్ హాలీడేస్ లాంటి సినిమాలు తీసి ఆడియన్స్‌ను థియేటర్‌కు తీసుకురండి. అప్పుడు ఆటోమేటిక్‌గా మంచి సినిమాలు నిలబడతాయి. చిన్న సినిమాలతో డైరెక్టర్లు అందరూ మంచి పేరు తెచ్చుకుంటున్నారు. కొత్త దర్శకులందరూ మంచి చిత్రాలు తీసి ఇండస్ట్రీని నిలబెట్టండి. చిన్న సినిమాలు ఎంత విజయం సాధిస్తే ఇండస్ట్రీ అంత బాగుంటుంది'' అని అన్నారు. ''చాలా రోజుల తర్వాత ఒక ఈవెంట్ ఇంత సంతోషంగా జరగడం చూస్తున్నాను. ఈ విషయంలో నిర్మాతలను అభినందించాలి. ఎందుకంటే ఈ మధ్యకాలంలో ఏ ఈవెంట్ కూడా ఇంత అద్భుతంగా జరగలేదు. థియేటర్‌లలో కూడా సందడి కనిపించడం లేదు. ఈ 'సమ్మర్ హాలీడేస్'తో థియేటర్‌లలో సందడి నెలకొనాలని కోరుకుంటున్నా'' అని దిల్‌రాజు తెలిపారు.

## ఆర్సీబీ సక్సెస్ సీక్రెట్ ఇదే

**- భువనేశ్వర్ కుమార్**



**విశ్వంభర, స్పోర్ట్స్ :** డిఫెండింగ్ ఛాంపియన్ ఆర్సీబీ.. మంగళవారం జరిగిన తొలి క్వాలిఫయర్‌లో గుజరాత్ టైటాన్స్‌ను చిత్తుగా ఓడించి ఫైనల్‌కు దూసుకెళ్లింది. బెంగళూరు పేసర్ భువనేశ్వర్ సంచలన బౌలింగ్‌తో ప్రత్యర్థి జట్ల బ్యాటర్లను బెంబేలెత్తిస్తూ జట్టు విజయాల్లో కీలకపాత్ర పోషిస్తున్నాడు. గుజరాత్‌తో క్వాలిఫయర్‌లో రెండు వికెట్లు పడగొట్టిన భువీ మ్యాచ్ అనంతరం మాట్లాడాడు. బ్యాటర్లను ఎలా వికెట్ల ముందు దొరకబుచ్చుకోవాలి, ఏవిధంగా క్లీన్‌బౌల్డ్ చేయాలనే తమ బౌలింగ్ ప్రణాళికల గురించి వివరించాడు. తమ విజయంలో డేటా (గణాంకాలు) ఎలాంటి పాత్ర పోషిస్తుందో తెలిపాడు. ''తెర వెనుక జరిగిన ప్రణాళికకు చాలావరకు ఘనత దక్కుతుంది. మేం (నేను, జోష్ హేజిల్‌వుడ్) మా అనుభవాన్ని రంగరించాం. సపోర్టింగ్ స్టాఫ్ అందిస్తున్న సహకారం మాకు ఎంతగానో ఉపయోగపడుతోంది. మేం డేటా (గణాంకాల) ఆధారంగా పనిచేస్తాం. ఆటగాళ్లు ఏదైనా కొత్త పద్ధతులను అనుసరిస్తుంటే వాటిని నిశితంగా పరిశీలిస్తాం. అయితే, కేవలం గణాంకాల పైనే 100 శాతం ఆధారపడం. కానీ, అవి మాకు కచ్చితంగా సహాయపడతాయి'' అని భువీ పేర్కొన్నాడు. తన, జట్టు బౌలింగ్ ప్రణాళికల గురించి మాట్లాడుతూ.. షార్ట్ లేదా ఫుల్లర్ బంతులు సంధిస్తే బౌండరీకి వెళ్తాయి. కానీ, మేం బ్యాటర్లకు ఏమాత్రం అవకాశం ఇవ్వకుండా వారిని ఎల్బీడబ్ల్యూ, బౌల్డ్ చేయడానికి చాలా ప్రయత్నిస్తాం'' అని భువనేశ్వర్ తెలిపాడు.

## అది ఒక తెలివి తక్కువ ప్రశ్న

### రిపోర్టర్‌పై గుజరాత్ బ్యాటర్ ఆగ్రహం



**విశ్వంభర, స్పోర్ట్స్ :** ఐపీఎల్ 2026 తొలి క్వాలిఫయర్‌లో గుజరాత్ టైటాన్స్‌ను మట్టికరిపించి ఆర్సీబీ వరుసగా రెండోసారి ఫైనల్‌కు దూసుకెళ్లింది. ఈ మ్యాచ్ అనంతరం నిర్వహించిన ప్రెస్ కాన్ఫరెన్స్‌కు గుజరాత్ బ్యాటర్ గ్లెన్ ఫిలిప్స్ హాజరయ్యాడు. తుది జట్టులో లేని అతను విలేకరుల సమావేశానికి రావడం అందర్నీ ఆశ్చర్యానికి గురిచేసింది. ఈ సందర్భంగా అతను కొన్ని కఠినమైన ప్రశ్నలు ఎదుర్కొన్నాడు. బెంగళూరు 254 పరుగుల భారీ స్కోరు చేయడం చూసి గుజరాత్ ఓటమిని అంగీకరించిందా? అని ఓ రిపోర్టర్ అడిగాడు. ఈ ప్రశ్నతో గ్లెన్ ఫిలిప్స్ నివ్వెరపోయాడు. ఇది ఒక తెలివి తక్కువ ప్రశ్న అని పేర్కొంటూ ప్రొఫెషనల్ క్రికెటర్లు ఎవరూ వెనక్కి తగ్గరని, జట్టు విజయం కోసం సర్వశక్తులు ఒడ్డుతారని ఘాటుగా సమాధానం ఇచ్చాడు. ''నిజంగానే ఇది ఒక తెలివి తక్కువ ప్రశ్న. 'మనం ఈ ప్రయత్నాన్ని మధ్యలోనే వదిలేద్దాం' అని అనుకుంటూ ఎవరూ మైదానంలోకి అడుగుపెట్టరు. ప్రొఫెషనల్ క్రికెటర్లుగా మేం అలా ఎందుకు చేస్తాం? అదొక అత్యంత చెత్త ప్రశ్న. మేం మైదానంలోకి దిగి మా శాయశక్తులా పోరాడాము. 250+ పరుగుల లక్ష్యాన్ని ఛేజ్ చేస్తున్నప్పుడు ప్రతిదీ మనకు అనుకూలంగా జరగాలి. గెలవాలనే సంకల్పంతోనే మేము బరిలోకి దిగాం. కానీ, అది జరగలేదు'' అని ఫిలిప్స్ పేర్కొన్నాడు. మ్యాచ్‌లో ఆడకపోయినప్పటికీ ప్రెస్ కాన్ఫరెన్స్‌కు వచ్చి మీడియాతో మాట్లాడటం ఇబ్బందిగా అనిపిస్తోందా? అని మరో రిపోర్టర్ అడిగాడు.''ఫర్వాలేదు. అంతా బాగానే ఉంది. మేమందరం ఒకే జట్టులో సభ్యులం. మీడియా పరంగా మా అందరికీ సమాన బాధ్యతలే ఉంటాయి. ఒక్కోసారి మ్యాచ్‌లో ప్రత్యక్షంగా పాల్గొనని వ్యక్తి బయటినుంచి అందించే సాయం ఆటగాళ్లకు ఎంతో సహాయపడుతుందని నేను భావిస్తాను. ముఖ్యంగా ఎలిమినేటర్ వంటి కీలక మ్యాచ్‌ల సమయంలో ఇది ఉపయోగపడుతుంది. ఆటగాళ్లు పూర్తి ఏకాగ్రతతో ఉండి మనసు సరైన స్థితిలో ఉంచుకోవడం చాలా ముఖ్యం. ఇప్పటివరకు మేం చాలా అద్భుతమైన క్రికెట్ ఆడాం. తదుపరి మ్యాచ్‌కు మా కుర్రాళ్లు సిద్ధమవ్వాలి. ఆశిష్ నెహ్రా చెప్పినట్లుగా ప్రశాంతంగా ఉంటూ ఎలిమినేటర్ మ్యాచ్‌కు సంసిద్ధులవ్వాలి'' అని ఫిలిప్స్ సమాధానమిచ్చాడు.

## ముగిసిన సన్‌రైజర్స్ జర్నీ..

### కీలక మ్యాచ్‌లో నెగ్గిన రాజస్థాన్

**విశ్వంభర, ముల్లాన్‌పూర్:** ఐపీఎల్ 2026 సీజన్‌లో సన్‌రైజర్స్ హైదరాబాద్ ప్రయాణం ముగిసింది. ఎలిమినేటర్ మ్యాచ్‌లో ఎస్ఆర్‌హెచ్‌పై రాజస్థాన్ 47 పరుగుల తేడాతో విజయం సాధించి, క్వాలిఫయర్ 2కు దూసుకెళ్లింది. తొలుత బ్యాటింగ్ చేసిన రాజస్థాన్ రాయల్స్ 20 ఓవర్లలో 8 వికెట్ల నష్టానికి 243 పరుగుల భారీ స్కోర్ చేసింది. వైభవ్ సూర్యవంశీ పెను విధ్వంసం సృష్టించగా, ధ్రువ్ జురెల్ మెరుపు ఇన్నింగ్స్ ఆడాడు. అనంతరం 244 పరుగుల లక్ష్యంతో బ్యాటింగ్‌కు దిగిన హైదరాబాద్ 19.2 ఓవర్లలో 196 పరుగులకు ఆలౌట్ అయింది. ఆ జట్టులో నితీశ్ కుమార్‌రెడ్డి (38) టాప్ స్కోరర్. సలీల్ అరోరా (35), ఇషాన్ కిషన్ (33), శివాంగ్ కుమార్ (27) ఫర్వాలేదనిపించారు. అభిషేక్ శర్మ (0), ట్రావిస్ హెడ్ (17), స్మరాన్ రవిచంద్రన్ (1), హెన్రిచ్ క్లాసెన్ (18) బ్యాటింగ్‌లో విఫలమయ్యారు. రాజస్థాన్ రాయల్స్ బౌలర్లలో ఆర్చర్ 3, జడేజా 2, నాంద్రే బర్గర్ 2, సుశాంత్ 2, యశ్‌రాజ్ ఒక వికెట్ తీసుకున్నారు. అంతకు ముందు రాజస్థాన్ రాయల్స్ బ్యాటర్లలో వైభవ్ సూర్యవంశీ (97; 29 బంతుల్లో, 5 ఫోర్లు, 12 సిక్సలు) సునామీ ఇన్నింగ్స్ ఆడాడు. త్రుటిలో రికార్డ్ సెంచరీ చేసే అవకాశాన్ని కోల్పోయాడు. ధ్రువ్ జురెల్ (50; 21 బంతుల్లో 5 ఫోర్లు, 3 సిక్స్‌లు) హాఫ్ సెంచరీతో సత్తా చాటాడు. యశస్వి జైస్వాల్ 29, రియాన్ పరాగ్ 26 ఫర్వాలేదనిపించారు. సన్‌రైజర్స్ హైదరాబాద్ బౌలర్లలో ప్రఫుల్ హింగే 3 వికెట్లు పడగొట్టాడు. ఎషాన్ మలింగ, శివాంగ్ కుమార్, నితీశ్‌రెడ్డి తలో వికెట్ తీశారు. క్వాలిఫయర్ 2 మ్యాచ్ శుక్రవారం ఇదే వేదికలో గుజరాత్ టైటాన్స్, రాజస్థాన్ రాయల్స్ మధ్య జరగనుంది.



Edited, Printed, Published & Owned by Dr. KACHAM SATYANARAYANA. RNI No : TGTEL/25/A1676, Printed at DVM Multi Colour Offset Printers, Dilsukhnagar, Hyderabad - 500060. Telangana. Published at #204, 2nd Floor, Badam Complex, Opp. Metro Pillar No. 1560, Chaitanyapuri X Road, Hyderabad - 500060. Telangana.EDITOR: Dr. KACHAM SATYANARAYANA. Cell: 9441224429 | Email: vishwambhara.daily@gmail.com